క్లుప్తంగా

కొనసాగుతున్న అంగన్‌వాడీ టీచర్ల శిక్షణ



మాట్లాడుతున్న ఎంఈవో వేణుగోపాలరావు

మునగపాక: మునగపాక జిల్లా పరిషత్ హైస్కూల్‌లో అంగన్‌వాడీ టీచర్లకు నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమం బుధవారం రెండో రోజుకు చేరుకుంది. ఐసీడీఎస్ సీడీపీవో ఇందిరాదేవి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎంఈవో వేణుగోపాలరావు మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లల అభ్యసనపై టీచర్లు దృష్టి సారించాలన్నారు. పిల్లలకు చదువుపై ఆసక్తి పెరిగేలా ఆట పాటలతో ఉత్సాహం నింపాలన్నారు. మునగపాక, తోటాడ సెక్టార్లకు సంబంధించిన అంగన్‌వాడీ టీచర్లు ఈ శిక్షణకు హాజరయ్యారు.

తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు



బోరును అందుబాటులోకి తీసుకువస్తున్న సర్పంచ్ గంగప్పలనాయుడు

మునగపాక: వేసవిలో తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా తగు చర్యలు తీసుకుంటున్నట్లు మూలపేట సర్పంచ్ భీశెట్టి గంగప్పలనాయుడు తెలిపారు. మూలపేట పంచాయతీ పరిధిలోని పీలా వారి పొలాల్లో బోరు నుంచి బురదనీరు రావడంతో పశువులకు తాగునీటి ఇబ్బందులను గుర్తించిన ఆయన తగు చర్యలు చేపట్టారు. పశువులకు సీజన్‌లో ఎటువంటి తాగునీటి సమస్య రాకుండా పంచాయతీ పాలకవర్గం కృషి చేస్తుందన్నారు.

చురుగ్గా వెంకన్న ఆలయ నిర్మాణం



మునగపాకలో చురుగ్గా సాగుతున్న వేంకటేశ్వరస్వామి ఆలయ పనులు

మునగపాక: మునగపాక బైపాస్ రోడ్డులో కలియుగ దైవం వేంకటేశ్వరస్వామి ఆలయ నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. భక్తుల విరాళాలతో ఆలయ నిర్మాణం జరుగుతున్న సంగతి తెలిసిందే. రూ.4 కోట్ల వ్యయంతో తలపెట్టిన ఆలయ నిర్మాణంలో భక్తులు భాగస్వాములు కావాలని నిర్వాహకులు కోరుతున్నారు.

మాజీ ఎంపీ అప్పలనరసింహంకు నివాళి



నాగులాపల్లిలో అప్పలనరసింహం విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

మునగపాక: నాగులాపల్లి గ్రామాభివృద్ధికి దివంగత మాజీ ఎంపీ పెతకంశెట్టి అప్పలనరసింహం ఎంతో కృషి చేశారని గవర కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ సురేంద్ర తెలిపారు. అప్పలనరసింహం జయంతి సందర్భంగా మండలంలోని నాగులాపల్లిలో ఆయన విగ్రహానికి పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో దొడ్డి శ్రీనివాసరావు, వైస్ ఎంపీపీ చిందాడ దేవి, టిక్కలి పరశురామ్, దాడి ముసిలినాయుడు, నూకాలయ్య, తదితరులు పాల్గొన్నారు.

చినదొడ్డిగల్లు పాఠశాలలో భాషోత్సవాలు



విద్యార్థులకు ప్రత్యేక ఇంగ్లిష్ తరగతులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

నక్కపల్లి: మండలంలో చినదొడ్డిగల్లు జెడ్పీ ఉన్నత పాఠశాలలో ప్రభుత్వం ఆదేశాల మేరకు రవీంద్రనాద్ ఠాగూర్ ఇంగ్లిష్ క్లబ్ ఆధ్వర్యంలో భాషోత్సవాలు నిర్వహిస్తున్నారు. పాఠశాల ఆంగ్ల ఉపాధ్యాయుడు ఏడిద వెంకటరమణ సొంత ఖర్చులతో ఇంగ్లిష్ క్లబ్‌ను ఏర్పాటు చేశారు. పదో తరగతి పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థుల్లో ఎవరైనా ఇంగ్లిష్ సబ్జెక్ట్‌లో వెనుకబడి ఉంటే వారి కోసం ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నామని వెంకటరమణ తెలిపారు. సాయంత్రం సమయంలో ఈ తరగతులు ఏర్పాటు చేసి విద్యార్థుల సందేహాలు నివృత్తి చేస్తున్నామన్నారు. విద్యార్థులకు ఏకాగ్రత, సమయపాలన, చేతి రాత అభివృద్ధి పరిచేందుకు వ్యాసరచన, ఆంగ్ల పద అన్వేషణ, వాయిస్ మాడ్యులేషన్ కోసం రైమ్స్ పోటీలు నిర్వహిస్తున్నామన్నారు.

వెరైటీ





వడపోస్తున్న టీ డికాషన్

ఇన్‌స్టంట్ ఎనర్జీనిచ్చే పానీయాల్లో టీ ది ఎప్పుడూ ఉన్నత స్థానమే. పూర్వీకులు తేయాకుతో చేసిన టీ మాత్రమే తాగేవారు. ప్రస్తుతం టీ ప్రియుల ఆసక్తికి అనుగుణంగా టీలలో ఎన్నో వెరైటీలు అందుబాటులో ఉన్నాయి. అల్లం, బెల్లం, ఇరానీ టీ, గ్రీన్ టీ, లెమన్ టీ, అల్లం టీ, సొంటి టీ, మసాలా టీ, బెల్లం టీ, హనీ టీ, బాదం టీ, ధమ్ టీ, బ్లాక్ టీ, కశ్మీర్ టీ, యాలకుల టీ ఇలా చాలా రకాల టీలు ప్రజాదరణ పొందుతున్నాయి. జిల్లాలో వివిధ ప్రాంతాలతో పాటు 16వ నంబరు జాతీయ రహదారికి ఇరువైపులా టీ కేఫ్‌లు, టీ అవుట్‌లెట్లు మార్గం పొడవునా అందుబాటులోకి వచ్చాయి. సాధారణ టీతో పాటుగా ఇరానీ టీ, గ్రీన్ టీ, లెమన్ టీలు తాగేందుకు ఎక్కువగా మక్కువ చూపుతున్నారు. ఇది వరకు ఒక కప్పు రూ.5 నుంచి రూ.10కే లభించే టీ ధర రకాన్ని బట్టి ఇటీవల రూ.10 నుంచి రూ.50 వరకు చేరుకుందని చాయ్ కూడా ప్రియమైంది భాయ్ అంటున్నారు టీ లవర్స్.

- పట్టణంలో పదుల సంఖ్యలో వెలిసిన టీ దుకాణాలు
- అందుబాటులో రకరకాల తేనీరు
- 16వ నంబరు జాతీయ రహదారి పక్కన పెరిగిన టీస్టాళ్లు
- పలువురికి ఉపాధినిస్తున్న టీ అవుట్‌లెట్లు

మనసు బాగోలేనప్పుడు, గుండె మంటగా ఉన్నప్పుడు, ఆలోచనలు అస్తవ్యస్తంగా మారినప్పుడు, తలంతా బరువుగా తోచినప్పుడు వెంటనే గుర్తుకు వచ్చేది టీ. అంతెందుకు ఉదయం నిద్ర లేవగానే టీ తాగనిదే దినచర్య మొదలుకాదు. ఉదయం టీ, సాయంత్రం టీ, నలుగురు స్నేహితులు కలిస్తే టీ, నలుగురు ఓ చోట కలిసి మాట్లాడుకోవాలన్నా టీ కొట్టు దగ్గరికి వెళ్లాల్సిందే. రాజకీయ, ఉద్యోగ, కార్మిక, కర్షక.. ఒకటేమిటి ఏ సమావేశం జరిగినా టీ తప్పనిసరి. మరిప్పుడు ఆ టీ కొత్త పుంతలు తొక్కుతోంది. ఎన్నో వెరైటీలతో విశేష ఆదరణ పొందుతోంది. ప్రత్యేక టీ అవుట్‌లెట్లతో ఎంతో మంది యువతకు ఉపాధినిస్తోంది.

యలమంచిలి రూరల్: ఒక కప్పు టీ మనసును ఉల్లాసపరుస్తుంది. అందు కోసం టీ తాగాల్సిందే అంటున్నారు సగటు పట్టణ పౌరులు. టీ తాగేందుకు ఎంత దూరమైనా వెళ్లే వారున్నారు. టీ లవర్స్ అభిరుచులను దృష్టిలో పెట్టుకొని నేడు యలమంచిలి, అనకాపల్లి, నర్సీపట్నం, చోడవరం, పాయకరావుపేట, అచ్యుతాపురం, జిల్లాలో మండల కేంద్రాలు, మేజర్ పంచాయతీలు సహా చిన్న గ్రామాల్లో సైతం పెద్ద సంఖ్యలో టీ అవుట్‌లెట్లు ఏర్పాటవుతున్నాయి. వర్షాకాలం, శీతాకాలం, వేసవికాలం ఇలా కాలమేదైనా వేడివేడి టీ తాగితే ఆ మజాయే వేరంటున్నారు టీ ప్రియులు. ప్రభుత్వ, ప్రైవేటు ఆఫీసుల్లో సైతం ఉద్యోగులు టీ కి సెపరేట్ టైం కేటాయిస్తుంటారు.

యలమంచిలి రైల్వేస్టేషన్ రోడ్డులో టీ కేఫ్



ఉపాధి పొందుతున్న యువత

టీ స్టాళ్ల ఏర్పాటు చేసుకోవడం ప్రస్తుతం మంచి వ్యాపార సాధనంగా **మారింది. కొందరు గ్రాడ్యుయేట్లు సైతం** సొంతంగా టీ స్టాళ్లు నడుపుతుండగా, **కొన్ని సంస్థలు తమ బ్రాండ్ పేరుతో** పట్టణాలు, గ్రామాలతో పాటుగా జాతీయ రహదారికి ఆనుకుని ఫ్రాంచైజీలను ప్రారంభిస్తున్నాయి. రూ.3 లక్షల నుంచి రూ.4 లక్షలు వెచ్చించి ఫ్రాంచైజీలను యువత తీసుకొని తమకు గిరాకీ ఉండే ప్రాంతాల్లో ఏర్పాటు చేసుకొని ఉపాధి పొందుతున్నారు. తమతో పాటు మరికొందరికి ఉపాధి కల్పిస్తున్నారు. ఈ ఫ్రాంచైజీల్లో వెరైటీ టీలు లభిస్తుండటంతో వీటికి ఆదరణ పెరుగుతోంది.



ఇరానీ టీ తయారు చేస్తున్న దృశ్యం

రోజూ టీ తాగాల్సిందే..



ప్రతి రోజూ ఒత్తిడి నుంచి ఉపశమనం పొందడానికి టీ తాగుతాను. మిత్రులు, బంధువులు, పరిచయస్తులు ఇలా ఎవరు కలిసినా టీ తాగడానికి ఇష్టపడతాం. ఇంటికి అతిథులొస్తే మర్యాదపూర్వకంగా టీ ఇస్తాం. తెలిసిన నలుగురితో కలిసి టీ తాగడం ఆనందంగా ఉంటుంది. ఏదైనా కారణంతో టీ తాగకపోతే ఆ రోజంతా ఏదో వెలితిగా ఉంటుంది. – వడ్లమాని కామేశ్వరరావు, యలమంచిలి

ఒత్తిడి నుంచి ఉపశమనం

చాలా మందికి రోజుకు మూడు నాలుగు సార్లు టీ తాగనిదే మనసు నిలువదు. ఎంతటి ఒత్తిడిలో ఉన్నా ఒక్క టీ తాగితే స్ట్రెస్ మొత్తం ఇట్టే తగ్గిపోతుందని టీ ప్రియులు చెబుతున్నారు. ముఖ్యంగా యాలకుల టీ ఒత్తిడి, నొప్పుల నుంచి క్షణాల్లో ఉపశమనం కలిగిస్తుందని, అందుకే ఈ టీ తగడం ఉత్తమం. అలాగే ఆరోగ్యానికి మేలు చేసే టీలెన్నో ఉన్నాయి. టీ తగడం వలన మానసిక ఉత్తేజంతో పాటు గుండె సంబంధిత వ్యాధుల నుంచి రక్షణ లభిస్తుంది. టీ తాగడం వలన బోలెడన్ని ఆరోగ్య ప్రయోజనాలునాయని వైద్యులు సైతం చెబుతున్నారు. మధుమేహం వంటి దీర్ఘకాలిక వ్యాధులను గ్రీన్, బ్లాక్ టీలు దూరం చేస్తాయని పరిశోధనల్లో తేలింది. చర్మం ముడతలు పడకుండా చేసి అందాన్ని కూడా పెంచడానికి టీ ఉపకరిస్తుంది.



యలమంచిలి ఆర్టీసీ బస్ కాంప్లెక్స్ వద్ద టీ తాగుతున్న స్థానికులు

ఉదయం 4 గంటల నుంచే టీ అమ్ముతా..



పట్టణంలో ఆర్టీసీ బస్ కాంప్లెక్స్ వద్ద 8 ఏళ్లుగా టీ స్టాల్ నిర్వహిస్తూ ఉపాధి పొందుతున్నాను. రోజూ ఉదయం 4 గంటల నుంచే టీ తాగేందుకు జనం వస్తారు. ఒక కప్పు టీ రూ.10 నుంచి రూ.20 వరకు తీసుకుంటున్నాం. గతంలో కంటే టీ లో వెరైటీలు తాగేందుకు ఎక్కువ మంది ఇష్టపడుతున్నారు. వారి అభిరుచికి అనుగుణంగా పలు రకాల టీలు తయారు చేస్తున్నాం. రోజుకు సుమారుగా 350 నుంచి 400 మంది వరకు మా వద్ద టీ తాగుతారు.
– మాదిరెడ్డి నాగర్జున, టీ దుకాణం నిర్వాహకుడు, యలమంచిలి

త్వరగా ఫార్మర్ రిజిస్ట్రీ చేసుకోవాలి

పాయకరావుపేట: మండలంలోని పెదరాంభద్రపురం, గుంటపల్లి గ్రామాల్లో బుధవారం మండల వ్యవసాయ శాఖ అధికారి పి.ఆదినారాయణ పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా క్షేత్ర సందర్శన, రైతులు, వ్యవసాయ అనుబంధ శాఖల అధికారులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఫార్మర్ రిజిస్ట్రీపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2024–25 సంవత్సరానికి 2,584 ఎకరాల విస్తీర్ణంలో అపరాలు సాగు చేస్తున్నారని, రబీ పంటకు ఈకేవైసీ 100 శాతం పూర్తి చేయాలని వ్యవసాయ శాఖ సిబ్బందికి సూచించారు. సమీప రైతు సేవా కేంద్రం సిబ్బందిని సంప్రదించి త్వరితగతిన ఫార్మర్ రిజిస్ట్రీ చేసుకోవాలన్నారు. అదే విధంగా ఎన్‌పీఎస్‌ఎస్ యాప్‌కూ కూడా రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఏఈవో జ్యోత్స్న, వీఏఏ వందన, స్థానిక రైతులు పాల్గొన్నారు.



రైతులకు పంటలపై అవగాహన కల్పిస్తున్న ఏవో ఆదినారాయణ

రోగుల పట్ల సత్ప్రవర్తనతో మెలగాలి

- డీఎంహెచ్‌వో రవికుమార్
- పెనుగొల్లు పీహెచ్‌సీ ఆకస్మిక తనిఖీ

ఎస్.రాయవరం: పీహెచ్‌సీకి వచ్చే రోగుల పట్ల సత్ప్రవర్తనతో మెలగాలని డీఎంహెచ్‌వో రవికుమార్ సిబ్బందికి సూచించారు. పెనుగొల్లు పీహెచ్‌సీని బుధవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. పబ్లిక్ హెల్త్ లేబొరేటరీ భవన నిర్మాణానికి స్థల పరిశీలన చేశారు. అనంతరం ఆస్పత్రిలో సేవలపై ఆరా తీశారు. పిల్లలకు టీకాలు, మందుల సరఫరా సక్రమంగా ఉండాలన్నారు. శానిటేషన్, వార్డులను పరిశీలించారు. ఆస్పత్రి పరిసరాలు నిత్యం పరిశుభ్రంగా ఉండాలని డీఎంహెచ్‌వో ఆదేశించారు. షిఫ్టుల వారీగా కేటాయించిన విధులకు పక్కాగా హాజరై మెరుగైన సేవలు అందించాలని సిబ్బందికి సూచించారు. రోజూ పీహెచ్‌సీకి వస్తున్న రోగుల వివరాలను జిల్లా ఆరోగ్య కేంద్రానికి నివేదించాలన్నారు. గ్రామాల్లో వ్యాధులు ప్రబలితే ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహించాలని చెప్పారు. రాత్రి వేళ ఉంటున్న సిబ్బంది రోగుల పట్ల అప్రమత్తంగా ఉంటూ వైద్య సేవలు అందించాలన్నారు.



పెనుగొల్లు పీహెచ్‌సీ సిబ్బందితో మాట్లాడుతున్న జిల్లా వైద్యాధికారి రవికుమార్

కొనసాగుతున్న విగ్రహాల పునః ప్రతిష్ట క్రతువు

యలమంచిలి రూరల్: పట్టణంలోని కొత్తపేట పర్వత వర్ధినీ సమేత రామలింగేశ్వరస్వామి ఆలయ పునర్నిర్మాణం, దేవతామూర్తుల పునః ప్రతిష్ట క్రతువు శాస్త్రోక్తంగా కొనసాగుతోంది. క్రతువులో భాగంగా వేద పండితులు ఉదయం నుంచి రాత్రి వరకూ నిర్వహిస్తున్న కార్యక్రమాలతో కొత్తపేటలో ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. బుధవారం సాయంత్రం రుద్ర హోమం, మూర్తి హోమం, వేద పారాయణ, జలాభివాసం, రుద్ర క్రమార్చన, నీరాజన మంత్ర పుష్పం జరిగాయి. వేదమంత్ర ఘోషతో ఆలయ పరిసరాలు మార్మోగాయి. అంతకు ముందు ఉదయం ప్రాతరొపాసన, నిత్య పూజ, పంచత్రింశతి అధివాసములు, ప్రత్యేక క్షీరాభిషేకం నిర్వహించారు. ఈ నెల 21న కొత్త ఆలయంలో తాండవ కాశీ తపోవన మఠాధిపతి పరమహంస సచ్చిదానంద సరస్వతి మహాస్వామి చేతుల మీదుగా విగ్రహ పునః ప్రతిష్ట జరగనుంది. ఈ కార్యక్రమం దిగ్విజయంగా పూర్తి చేయడానికి ఆలయ పునర్నిర్మాణ కమిటీ ప్రతినిధులు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ పిల్లా రమాకుమారి, పునర్నిర్మాణ కమిటీ సభ్యులు పెద్దింటి సూర్యనారాయణమూర్తి, బండారు సత్య బంగారుశెట్టి, సుందరపు బాబ్జీ, దాట్ల సుబ్బరాజు, చందక అప్పారావు, సీతాజీ, లంకరాజు, పిల్లా త్రినాథరావు, తదితరులు పాల్గొన్నారు.



పునః ప్రతిష్ట క్రతువులో దేవతామూర్తుల విగ్రహాలకు క్షీరాభిషేకం చేస్తున్న వేద పండితులు

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో మొరాయించిన సర్వర్

యలమంచిలి రూరల్ : సర్వర్ మొరాయించడంతో స్థానిక సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద బుధవారం డాక్యుమెంట్ల రిజిస్ట్రేషన్ల కోసం కక్షిదారులు తీవ్ర అవస్థలు పడ్డారు. ఉదయం కార్యాలయం తెరిచిన దగ్గర్నుంచీ వివిధ రకాల సాంకేతిక కారణాలతో స్టాంపులు రిజిస్ట్రేషన్ల శాఖ సెంట్రల్ సర్వర్ గంటలకొద్దీ పనిచేయలేదు. దీంతో రిజిస్ట్రేషన్ల కోసం కార్యాలయానికి వచ్చిన వృద్ధులు, మహిళలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. సుదూర ప్రాంతాల నుంచి ఎంతో ప్రయాస పడి వచ్చిన కక్షిదారుల సహనానికి పెద్ద పరీక్షగా మారింది. ఒక పక్క ఎండ తీవ్రత పెరగడం, కార్యాలయం వద్ద కక్షిదారుల సంఖ్యకు సరిపడా కూర్చునేందుకు కుర్చీలు లేకపోవడంతో అందరూ తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనాల్సి వచ్చింది. జిల్లా వ్యాప్తంగా ఇదే పరిస్థితి నెలకొనడంతో ప్రభుత్వం, సంబంధిత అధికారులపై కక్షిదారులతో పాటు, సీఐటీయూ యలమంచిలి కార్యదర్శి చింతకాయల శివాజీ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వానికి అధిక ఆదాయాన్నిచ్చే స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖలో ఈ పరిస్థితి నెలకొనడం దారుణమని శివాజీ అభిప్రాయపడ్డారు.



బుధవారం రాత్రి యలమంచిలి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద నిరీక్షిస్తున్న కక్షిదారులు

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

అచ్యుతాపురం రూరల్: మండలంలో పలు గ్రామాల్లో గురువారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనున్నట్టు ఏపీఈపీడీసీఎల్ అనకాపల్లి డివిజన్ ఈఈ కె.రాజశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. వెదురువాడ, గొర్లి ధర్మవరం, లంక ధర్మవరం, మెట్ట ధర్మవరం, మోసయ్యపేట బర్మా కాలనీ, అచ్యుతాపురం ఇందిరమ్మ కాలనీ ఏరియా, ఆర్ అండ్ ఆర్ కాలనీ, దిబ్బపాలెం, వెంకటాపురం కూడలి, మార్టూరు రోడ్, అచ్యుతాపురం సెంటర్, సాయిప్రియా లే-అవుట్ గ్రామాల్లో ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకూ విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందన్నారు.

విద్యుత్ సరఫరాలో మార్పులు

పాయకరావుపేట: 220కేవీ పరవాడ సబ్ స్టేషన్‌లో 100 ఎంవీఏ పవర్ ట్రాన్స్‌ఫార్మర్‌కి సంబంధించిన హెచ్‌వీ సైడ్ పాత బ్రేకర్ స్థానంలో కొత్త బ్రేకర్‌ను మారుస్తున్న కారణంగా గురువారం కోరుప్రోలు, పాయకరావుపేట సబ్ స్టేషన్ల పరిధిలో విద్యుత్ సరఫరాలో మార్పులు ఉంటాయని విద్యుత్ శాఖ కార్యనిర్వహణ ఇంజినీర్ తెలిపారు. పాయకరావుపేట, ఎస్.రాయవరం మండలాల పరిధిలో ఉన్న అన్ని గ్రామాలకు గురువారం త్రీఫేస్ సరఫరా సమయాలలో మార్పులు ఉంటాయని పేర్కొన్నారు. ఆయా గ్రామాలకు రాత్రి ఒంటి గంట నుంచి ఉదయం 7 గంటలకు వరకు, సాయంత్రం 5 నుంచి రాత్రి 8 గంటలకు వరకు త్రీ ఫేస్ సరఫరా చేస్తామని ఆయన తెలిపారు.

మడకపాలెంలో నేడు తులసిమాంబ పండగ


మునగపాక: మడకపాలెంలో గురువారం తులసిమాంబ అమ్మవారి పండగను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు కమిటీ సభ్యులు తెలిపారు. అమ్మవారి దర్శనానికి వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకున్నామన్నారు. రాత్రికి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు తెలిపారు.

మునగపాక ఎస్‌ఐ ప్రసాదరావు మానవత్వం

మునగపాక: మునగపాక ఎస్‌ఐ పి.ప్రసాదరావు బుధవారం మానవత్వం చాటుకున్నారు. స్థానిక పోలీసు స్టేషన్‌లో విధి నిర్వహణలో ఉన్న హెచ్‌సీ మురళీకి అకస్మాత్తుగా కడుపు నొప్పి రావడంతో వెంటనే స్పందించిన ఎస్‌ఐ హుటాహుటిన తన జీపులో డ్రైవింగ్ చేసుకుంటూ ఆయనను మునగపాక పీహెచ్‌సీకి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ హెచ్‌సీ మురళీ కోలుకున్నారు. అనంతరం సమాచారాన్ని మురళి కుటుంబ సభ్యులకు అందించారు. వారొచ్చి ఆయనను విశాఖకు తీసుకువెళ్లారు. సకాలంలో ఎస్‌ఐ ప్రసాదరావు స్పందించడంపై మురళీ కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

తక్షణమే పీఆర్సీ ప్రకటించాలి

నక్కపల్లి: కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు 12వ పీఆర్సీని తక్షణమే ప్రకటించి అమలు చేయాలని యూటీఎఫ్ నాయకులు వెంకటేశ్వర్లు, వెంకటరావు డిమాండ్ చేశారు. బుధవారం వారు నక్కపల్లిలో మాట్లాడుతూ ఉపాధ్యాయులకు సంబంధించి అన్ని సమస్యలు పరిష్కరిస్తామంటూ ఎన్నికల ముందు హామీ ఇచ్చిన కూటమి నాయకులు.. అధికారం చేపట్టి ఎనిమిది మాసాలు గడుస్తున్నా పీఆర్సీ గురించి మాట్లాడడం లేదని ఆరోపించారు. దీనిపై ఉపాధ్యాయుల్లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోందన్నారు. పీఆర్సీ ఏర్పాటు చేసి, కమిషన్ రిపోర్టు వచ్చే లోపు 30 శాతం ఐఆర్ ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఉద్యోగ, ఉపాధ్యాయులకు రావాల్సిన రూ.25వేల కోట్ల బకాయిలను తక్షణమే విడుదల చేయాలన్నారు. ప్రతి ఐదేళ్లకు ద్రవ్యోల్బణం ఆధారంగా ఉద్యోగుల వేతనాలను స్థిరీకరించాలని, దీన్ని పొందడం ఉద్యోగుల హక్కు అని పేర్కొన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో విజయగౌరిని గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ నేతలు డి.ఆర్.కె.శాస్త్రి, మహేష్, సత్యనారాయణ, శ్రీకాంత్, మాడెం సత్యనారాయణ, జయనాయక్, నానాజీ, దుర్గాప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.



నక్కపల్లిలో మాట్లాడుతున్న యూటీఎఫ్ నాయకులు

రైతులతో సచివాలయాలు కళకళ

మునగపాక: కేంద్ర ప్రభుత్వం ఫార్మర్ రిజిస్ట్రీ కార్యక్రమానికి శ్రీకారం చుట్టడంతో రైతులు సచివాలయాలకు తరలివస్తున్నారు. ప్రతి రైతు తప్పనిసరిగా ఫార్మర్ రిజిస్ట్రీ చేయించుకోవాలని ప్రకటించడంతో సచివాలయాల్లోని వీఏఏలు, వీహెచ్ఏల ద్వారా ప్రక్రియ చేయించుకుంటున్నారు. దీంతో సచివాలయాలు రైతులతో కళకళలాడుతున్నాయి. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పీఎం కిసాన్‌తో పాటు రాష్ట్ర ప్రభుత్వం అందించనున్న అన్నదాత సుఖీభవ పథకం వర్తించాలంటే ఫార్మర్ రిజిస్ట్రేషన్ తప్పనిసరి చేయడంతో రైతులు సచివాలయాలకు పరుగులు తీస్తున్నారు. ఈ నెల 25లోగా రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారి సీహెచ్ జ్యోత్స్నకుమారి కోరారు.



మునగపాక సచివాలయంలో ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేయించుకుంటున్న రైతులు

బొలిశెట్టి గోవిందుకు పలువురు పరామర్శ

ఎస్.రాయవరం: వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బొలిశెట్టి గోవిందరావు తండ్రి, పార్టీ సీనియర్ నేత బొలిశెట్టి అప్పారావు మృతి పార్టీకి తీరని లోటని మాజీ ఎమ్మెల్సీ డీవీ సూర్యనారాయణరాజు అన్నారు. ఈ మేరకు బుధవారం గోవింద్‌ను ఆయన పరామర్శించారు. అప్పారావు ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షిస్తూ చిత్ర పటం వద్ద పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ పరామర్శలో మాజీ జెడ్పీటీసీ వంగలపూడి సత్యవతి, పార్టీ నాయకుడు మధువర్మ, తదితరులు ఉన్నారు. అలాగే జిల్లా గ్రంథాలయ మాజీ చైర్మన్ తోట నగేష్ కూడా గోవిందరావును పరామర్శించారు.



అప్పారావు చిత్ర పటం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్సీ డీవీ సూర్యనారాయణరాజు

కె.వి.పురంలో పారిశుధ్య డ్రైవ్

కోటవురట్ల: కె.వెంకటాపురంలో పారిశుధ్య డ్రైవ్ నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా బుధవారం గ్రామంలోని ప్రధాన కాలువల్లో పూడిక తీసి ట్రాక్టర్ల ద్వారా తరలించారు. వైఎస్సార్ సీపీ నాయకుడు పైల నాని పనులను పర్యవేక్షించారు. సర్పంచ్ పైల శ్రీదేవి మంగా ఇందిర భవానీ మాట్లాడుతూ గ్రామంలో ఆహ్లాద వాతావరణం నెలకొనేందుకు చర్యలు చేపట్టినట్టు తెలిపారు. పూర్తి స్థాయిలో పూడిక తీత పనుల్లో భాగంగా వారం రోజులుగా పనులు చేపడుతున్నామన్నారు.



కె.వెంకటాపురంలో పూడిక తీసి ట్రాక్టరులో తరలిస్తున్న కార్మికులు

నేత్ర వైద్య విభాగం ప్రారంభం

పాయకరావుపేట: శ్రీప్రకాష్ ఆయుర్వేద ఆస్పత్రిలో నేత్ర వైద్య విభాగాన్ని బుధవారం ప్రముఖ వ్యాపారవేత్త చక్కా మల్లికార్జున ప్రారంభించారు. ఈ విభాగంలో డాక్టర్ ఎం.ఎ.సుమయ్య ప్రధాన వైద్యురాలిగా వ్యవహరిస్తారని, నేత్ర వైద్యానికి అవసరమైన అన్ని సేవలు అందుబాటులో ఉంటాయని ఆయుర్వేద ఆస్పత్రి ప్రధాన వైద్యుడు డాక్టర్ రమేష్ తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీప్రకాష్ ఆయుష్ చారిటబుల్ ఫౌండర్ ట్రస్టీ సిహెచ్.వి.కె.నరసింహారావు, సాయిగ్రామ్ ఆయుర్వేద హాస్పిటల్ అండ్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ సీఈవో(కోయంబత్తూరు) డాక్టర్ ఆలపాటి రాజేంద్రప్రసాద్, ఆస్పత్రి సిబ్బంది, తుని, పాయకరావుపేటకు చెందిన పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.



నేత్ర వైద్య విభాగాన్ని ప్రారంభిస్తున్న వ్యాపారవేత్త చక్కా మల్లికార్జున, తదితరులు